
సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం | 25 | ఫిబ్రవరి | 2023



జాతరకు వేళాయె!

భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి, చల్లని ఆశీస్సులు అందించే శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు సర్వం సిద్ధమైంది.

- 8లో



పట్టుదలతోనే విజయాలు సొంతం

పట్టుదలతోనే విజయాలు సాధ్యమవుతాయని, అందుకు నిదర్శనం గ్రంథి మల్లిఖార్జునరావేనని పారిస్‌కు చెందిన గ్రూపు ఏడీపీ చైర్మన్, సీఈఓ ఆగస్టిన్ డి.రోమానెట్ అన్నారు.

- 8లో

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి అవకాశం

విజయనగరం ఫూల్‌బాగ్: పది తరువాత ఇంటర్మీడియెట్‌లో చేరకుండా, ఇంటర్ చదువుతూ మధ్యలో మానేసిన వారికి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ వారు చదువుకునేందుకు మరో అవకాశం కల్పించినట్లు ఇంటర్మీడియెట్ డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. దగ్గరలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకు ఈ నెల 27వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

న్యూస్‌రీల్

వేగవంతంగా ఆర్‌అండ్‌ఆర్ పనులు

- జేసీ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆనంద్

పార్వతీపురం: జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద పునరావాస పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. ఆర్‌అండ్‌ఆర్ పనులపై రెవెన్యూ, కార్యనిర్వాహణ శాఖలతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కాలనీలలో మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. ఎక్కడైనా సమస్యలుంటే తక్షణం పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ జె.వెంకటరావు, ఆర్‌డీఓ కె.హేమలత, గిరిజన సంక్షేమ శాఖ, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు శాంతీశ్వరరావు, జేమ్స్, ప్రభాకరరావుతో పాటు వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

రికార్డు అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్

పార్వతీపురం టౌన్: విజయనగరం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎంఎల్‌ఎస్‌సీ విభాగంలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన రికార్డు అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, విజయనగరం వారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి చదివి 18 సంవత్సరాల నుండి 42 సంవత్సరాల వయస్సు కలిగిన దృష్టి లోపం గల మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

27న మీ వద్దకే పీఎఫ్

విజయనగరం టౌన్: పీఎఫ్ ఖాతాదారులకు, పెన్షనర్లకు, పీఎఫ్ సంస్థల యజమానులకు సంబంధించిన సమస్యలపై ఈ నెల 27న మీ వద్దకే పీఎఫ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అబ్దుల్ ఖాదర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విజయనగరంలో హిమగిరి థియేటర్ పక్కన ఎస్పీ బంగ్లా సమీపంలో ఉన్న ఈపీఎఫ్ఓ కార్యాలయంలోనూ, పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పీఎఫ్ సమస్యలు ఉన్న వారందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు యశ్వంత్

- ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ



బొమ్మి యశ్వంత్

తెర్లాం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న అండర్ - 14 విభాగంలో జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు తెర్లాం మండలం కూనాయవలసకు చెందిన బొమ్మి యశ్వంత్ ఎంపికయ్యాడు. ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ బాలబాలికల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో రాష్ట్రం తరఫున నలుగురు క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అందులో యశ్వంత్ ఒకరు. ఏప్రిల్, మే నెలలో ఈ పోటీలు జరగనున్నాయి. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న యశ్వంత్ జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, తోటి విద్యార్థులు, క్రీడాకారులు అభినందించారు.

పులి పంజా



పులి దాడిలో మృతి చెందిన ఆవు

మెంటాడ: మండలంలోని మల్లేడవలస గ్రామంలో గురువారం రాత్రి బొండపల్లి మురళి, మల్లేడ లక్ష్మీలకు చెందిన రెండు ఆవులను బెంగాల్ టైగర్ దాడి చేసి చంపినట్లు అటవీ శాఖ మెంటాడ రేంజ్ అధికారి కెవిఎస్.రాజు తెలిపారు. శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన ఆవులను పరిశీలన చేశారు. ఆవులపై పులి దాడి వాస్తవమేనన్నారు. పులి సంచారంపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు. స్థానికులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, చీకటి పడిన తరువాత ఇళ్ల నుండి ఆరుబయటకు వెళ్లవద్దని సూచించారు.

మన్యంలో ఆర్టీసీకి కొత్త కళ



- ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుకు చర్యలు
- ప్రయాణికుల భద్రత కోసం బీఎస్ 6 వాహనాలు
- జిల్లాకు కొత్తగా 25 బస్సులు
- పూర్తి స్థాయిలో 266 యూటీఎస్ టీమ్‌లు

ఆర్టీసీ ప్రయాణికుల సేవల కోసం మరిన్ని చర్యలు చేపట్టింది. సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా సంస్థ చేపడుతున్న చర్యలతో ఈ ప్రాంతంలో ఆర్టీసీకి ప్రయాణికుల ఆదరణ రోజురోజుకు పెరుగుతోంది. ఇదే అదనుగా మరిన్ని సర్వీసులు నడిపేందుకు సిద్ధమైంది.

పార్వతీపురం టౌన్:

ఆర్టీసీ అంటే ప్రయాణికుల్లో ఓ నమ్మకం. సురక్షిత ప్రయాణం ఆర్టీసీకే సొంతమన్న భావనతో పాటు ఓ భరోసా.. దీన్ని మరింత నిజం చేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం మరిన్ని సేవలు అందుబాటులోకి తెచ్చారు. చౌకగా రవాణా సేవలు అందిస్తున్నారు. అందుకే ఆర్టీసీలో ప్రజా రవాణా సేవలకు ఆదరణ పెరుగుతుంది. దీనికి పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజా రవాణా సేవలే నిదర్శనం. మన్యం జిల్లాలో ఆర్టీసీ సేవలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థులకు సేవలందిస్తుంది. ఇదే సమయంలో చిల్లర సమస్యలకు చెక్ పెట్టేందుకు యూటీఎస్ టీమ్‌లు, విద్యార్థులకు రాయితీతో కూడిన బస్సు పాసులు, సరుకుల రవాణాకు కార్గో సేవలను విస్తరింపజేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఆర్టీసీ అధికారులు మరో ముందడుగు వేశారు. అధునాతన సాంకేతికతతో కూడిన బీఎస్ 6 బస్సులను తొలి విడతలో పార్వతీపురానికి 25 వాహనాలను మంజూరు చేశారు. ప్రయాణికుల భద్రత కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పులకు శ్రీకారం చుడుతున్నారు.

పూర్తి స్థాయిలో 266 యూటీఎస్ టీమ్‌లు

చిల్లర సమస్యకు చెక్ పెట్టిందుకు ఆర్టీసీలో నగదు రహిత ప్రయాణం చేసేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ చార్జీలు చెల్లించుకునే అవకాశాన్ని ఆర్టీసీ కల్పించింది. అందుకుగానూ జిల్లాలో పూర్తి స్థాయిలో 266 యూటీఎస్ టిమ్‌లు అందుబాటులో తీసుకువచ్చారు. బ్యాంకు ఖాతాలో డబ్బు ఉంటే చాలు యూపీఐ, డెబిట్ కార్డు, డిజిటల్ పేమెంట్లను అందుబాటులోకి తీసుకువచ్చి అటు ప్రయాణికులకు, ఇటు ఉద్యోగుల విధులకు ఆటంకం లేని పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం డిపోకు 82, పాలకొండ డిపోకు 79, సాలూరు డిపోకు 65 మొత్తం జిల్లాకు 266 యూటీఎస్ టిమ్‌లు కేటాయించారు. దీంతో ప్రయాణికులకు చిల్లర సమస్య తీరింది.



జిల్లాకు మంజూరైన బస్సులను ప్రారంభిస్తున్న అధికారులు

జిల్లాకు కేటాయించిన బీఎస్-6 బస్సులు

డిపో	అల్ట్రా పల్లె వెలుగు	పల్లె వెలుగు	ఎక్స్‌ప్రెస్‌లు
పార్వతీపురం	8	3	3
సాలూరు	4	1	-
పాలకొండ	-	4	2

పూర్తి స్థాయిలో సేవలు



ప్రభుత్వం ఆర్టీసీ అభివృద్ధికి పెద్ద పీట వేస్తుంది. జిల్లాకు కొత్త బస్సులు కావాలని ప్రభుత్వానికి నివేదికలను అందజేశాం. ప్రభుత్వం తక్షణమే స్పందించి సాంకేతికతతో కూడిన బీఎస్-6 వాహనాలను జిల్లాకు 25 బస్సులను మంజూరు చేసింది. విద్యార్థుల కోసం జిల్లాలో 8 ప్రత్యేక స్టూడెంట్ స్పెషల్ సర్వీసులు, 3205 ఉచిత బస్సు పాసులు, 9125 రాయితీ పాసులను అందించాం. చౌకగా రవాణా చేసుకునేందుకు కార్గో సేవలను అందుబాటులో తీసుకువచ్చాం.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి, పార్వతీపురం మన్యం



విజయవాడలోని రాజభవన్‌లో నూతన గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర

పంట పొలాల్లో గజరాజులు

భామిని:

మండలంలోని లివిరిలో నాలుగు ఏనుగుల గుంపు శుక్రవారం ఆకస్మాత్తుగా పొలాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేశాయి. సోమరాజు గోపాలరావుకు చెందిన లివిరి వ్యవసాయ క్షేత్రంలో ఏనుగులు చొరబడి మొక్కజొన్న, పామాయిల్, కొబ్బరితోటలను ధ్వంసం చేశాయి. కొద్ది రోజులుగా పసుకుడిలో తిష్ట వేసిన ఏనుగులు ఆకస్మాత్తుగా రూటు మార్చి వంశధార నదీ తీరం వెంబడి ప్రయాణించి లివిరి పంట పొలాల్లోకి ప్రవేశించాయి. పంట నష్టాలను అంచనా వేసి అధికారులు ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఇంకా కదలని ఏనుగులు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి - నడుకూరు ప్రాంతంలోని పంట పొలాల వైపు వచ్చిన ఏనుగులు ఇంకా కదలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం రాత్రి కిమ్మి - నడుకూరు రోడ్డు పైకి ఏనుగులు రావడంతో ఈ రోడ్డులో ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. పగలంతా ఎండ వేడిమికి చెరుకు తోటలో తిష్ట వేస్తున్న ఏనుగులు సాయంత్రం వాతావరణం చల్లబడే సరికి రోడ్లపైకి పక్కనే ఉన్న పొలాల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. ఏనుగులను ఇతర ప్రాంతాల వైపు మళ్లించేందుకు కొందరు వ్యక్తులు పొలాల్లో గడ్డి కుప్పలకు, చెరుకు తోటలకు నిప్పు పెడుతుండడంతో ఏనుగులు ఎటూ వెళ్లకుండా ఇక్కడే తిష్ట వేస్తున్నాయని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఆరు ఏనుగుల గుంపు నుండి విడిపోయిన ఒంటరి ఏనుగు హరి వస్తేగాని ఇక్కడి నుండి ఇవి కదిలే పరిస్థితి లేదని డీఆర్ఓ రవిబాబు పేర్కొన్నారు. అంతవరకు ఏనుగులను ఎవరూ కవ్వించవద్దని కోరారు.



భామిని: లివిరి వ్యవసాయ క్షేత్రంలో ప్రవేశించిన ఏనుగుల గుంపు

ముగిసిన బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ వైద్య కళాశాలలో మూడు రోజులుగా నిర్వహించిన ప్రాణాపాయ స్థితిలో అందించాల్సిన సత్వర చికిత్సపై(బేసిక్ లైఫ్ సపోర్ట్) శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఎనస్తీషియా విభాగం ఆధ్వర్యంలో 150 మంది జూనియర్ డాక్టర్లకు శిక్షణ అందించారు. అత్యవసర పరిస్థితుల్లో, ఊపిరి అందని ప్రాణాపాయ స్థితిలో రోగికి ఎలా ఊపిరి అందించాలి? అటువంటి వారిని ఎలా రక్షించాలి? అనే అంశాలపై ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ డివిజి.శంకరరావు, డాక్టర్ చైతన్య వైద్యులకు నేర్పించారు. సదరు ప్రక్రియలను ప్రయోగాత్మకంగా వివరించారు. శిక్షణ పొందిన వైద్యులకు ధ్రువపత్రాలను అందజేశారు. డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాల్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రఘురాం తదితరుల పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.



శ్వాస అందించే ప్రక్రియను వివరిస్తున్న డాక్టర్ శంకరరావు

● 'ఈనాడు'పై ప్రజాగ్రహం



అవాస్తవ కథనాలు ప్రచురిస్తూ ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్న ఈనాడు పత్రికపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధపు వార్తలు రాస్తూ పచ్చ మీడియా తన వక్ర బుద్ధిని నిరూపించుకుంటుందని నినదించారు. ఈనాడు తప్పుడు కథనాలపై ఎంపీపీ శెట్టి పద్మావతి, సర్పంచ్ గార్ల సుజాత, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగేశ్వరరావు, షేక్ ఆదిల్ ఆధ్వర్యంలో రావాడ కూడలిలో ఈనాడు ప్రతులను ప్రజలు శుక్రవారం దహనం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు. – కురుపాం

ఎందుకీ జాప్యం!

'దేవుడు వరమిచ్చినా... పూజారి వరమివ్వడన్న చందాన..' ఉంది జిల్లా క్షయ నివారణాధికారుల తీరు. ఈ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా...భర్తీకి జిల్లా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ జాప్యంపై నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- క్షయ నివారణ శాఖలో నిర్లక్ష్యం
- పోస్టుల భర్తీలో జాప్యం చేస్తున్న వైనం
- నిధుల ఖర్చులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు
- నోటిఫికేషన్ ఇచ్చి నాలుగు నెలలైనా భర్తీ లేదు...

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో క్షయ నివారణ శాఖాధికారులు ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయడంలో తీవ్ర జాప్యం ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ శాఖలో జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆదేశించినా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పోస్టులను తమ వారికి కట్టబెట్టడం కోసమే ఇలా జాప్యం వహిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. 2022 నవంబర్ 8వ తేదీన క్షయ నివారణ శాఖలో 7 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్(ఎస్‌టీఎస్), ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు – 4, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్ వైజర్ (ఎల్‌ఎటీఎల్‌ఎస్) పోస్టులు రెండింటికి నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తు చేయడానికి 2022 నవంబర్ 17 వరకు గడువు ఇచ్చారు. దీంతో ఆయా పోస్టుల కోసం నిరుద్యోగ అభ్యర్థులు 200 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. క్షయ నివారణ శాఖ అధికారులు డిసెంబర్ నెలలో ప్రొవిజనల్ మెరిట్ జాబితా పెట్టారు. తర్వాత ఆ పోస్టుల భర్తీని పట్టించుకోలేదు. క్షయ నివారణ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి నోటిఫికేషన్‌లో ఇచ్చిన ఓ పోస్టును కట్టబెట్టడం కోసం అధికారులు పోస్టులు భర్తీ చేయకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఉద్యోగి తన కోసం విద్యార్హతను తప్పుగా పత్రికల్లో ప్రకటన ఇచ్చినట్లు అధికారులకు తెలిసింది. దీంతో అతనికి షోకాజ్ నోటీస్ ఇచ్చి అధికారులు సరిపెట్టేశారు. ఎటువంటి చర్య తీసుకోలేదు. నోటిఫికేషన్ ఇచ్చి నాలుగు నెలలవుతున్నా ఇంతవరకు పోస్టులు భర్తీ చేయకపోవడంతో అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. గడిచిన ఏడాది కాలంలో క్షయ నివారణ శాఖలో ఖర్చు చేసిన నిధులకు సంబంధించి రికార్డుల నిర్వాహణ సక్రమంగా లేదని కూడా తెలిసింది.



క్షయ నివారణశాఖ కార్యాలయం

ఉన్నతాధికారులకు నివేదించాం..

పోస్టుల భర్తీకి సంబంధించి విద్యార్హతల్లో క్లారిఫికేషన్ కోసం రాష్ట్ర అధికారులకు నివేదించాం. 2017లో ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రాప్తికి శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల క్షయ నివారణ శాఖ అధికారులు ఆ విధంగా భర్తీ చేశారు. తమకు కూడా అలానే చేయమన్నారు. తగు చర్యలు చేపట్టాం.

– డాక్టర్ రామేశ్వరి ప్రభు, జిల్లా క్షయ నివారణ అధికారి

'తోటపల్లి' పనులు వేగవంతం చేయండి

- ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తి స్థాయిలో నీరందించాలి
- ఎడమ కాలువ పనులు పరిశీలించిన చీఫ్ ఇంజినీర్ సుగుణాకరరావు

వీరఘట్టం:

పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లా రైతుల ఆశల సౌధం తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులు వేగవంతంగా చేపట్టాలని జల వనరుల శాఖ ఉత్తరాంధ్ర జిల్లాల చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకరరావు ఆదేశించారు. తోటపల్లి ప్రాజెక్టు నుండి వీరఘట్టం మండలం ఎం.రాజపురం వరకు ఎడమ కాలువలో జరుగుతున్న ఆధునికీకరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సకాలంలో నీరందించేలా పనులను చేపట్టాలని సూచించారు. కుడి, ఎడమ కాలువలో ఉన్న బ్రిడ్జిలు, సూయిజ్ కాలువలు త్వరగా నిర్మించాలని తెలిపారు. పెద్దబుడ్డిడి వద్ద ఉన్న బ్రిటిష్ కట్టడం స్థానంలో ఆక్విడేట్ నిర్మించేందుకు డిజైన్ యొక్క డ్రాయింగ్‌ను తక్షణమే పంపించాలని సూచించారు. అన్ని డిస్ట్రిబ్యూటరీ చానళ్ల వద్ద షట్టర్లను మరమ్మతులు చేయించాలని తెలిపారు. రూ.193 కోట్లతో చేపడుతున్న తోటపల్లి ఆధునికీకరణ పనులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిధులు మంజూరు చేస్తోందని, ప్రభుత్వం, రైతులు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుని కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో నీరిందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ పనులకు అనుకూలంగా ఉన్నందున నిరాటంకంగా పనులు చేపట్టాలే అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇంత వరకు చేపట్టిన పనుల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జల వనరుల శాఖ ఎస్ఈ పి.సుధాకరరావు, డీఈఈ దమలపాటి రవికుమార్, ఏఈలు బి.శంకరరావు, డీవీ రమణ, కాంట్రాక్టర్ మోహన్‌బాబు, శ్రీకాంత్ ఉన్నారు.



ప్రస్తుతం జరుగుతున్న తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులపై వివరాలు అడుగుతున్న చీఫ్ ఇంజినీర్ సుగుణాకరరావు

తక్షణమే రక్షణ గోడ నిర్మించాలి

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ హెడ్ వద్ద రక్షణ గోడను తక్షణమే నిర్మించాలని నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకరరావు అన్నారు. తోటపల్లి ప్రాజెక్టు పాత ఎడమ, కుడి కాలువ లైనింగ్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రానున్న ఖరీఫ్ ప్రారంభం నాటికి మొత్తం లైనింగ్ పనులు పూర్తి కావాలన్నారు. జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి దగ్గర సైఫాన్ పనులకు సంబంధించి డ్రాయింగ్ మరియు డిజైన్‌ను తక్షణమే పంపించాలన్నారు. బ్రిడ్జిలను మరియు సూపర్ పాసేజీలను త్వరగా నిర్మించాలని ఆదేశించారు. ఎడమ, కుడి కాలువ షట్టర్లను తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. తోటపల్లి, పెదబుడ్డిడి, రాజపురం, కత్తులకవిటి, హుస్సేన్‌పురం దగ్గర జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పర్యవేక్షక ఇంజినీర్ పి.సుధాకర్, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ బి.శంకరరావు, డివి.రమణ తదితరులు న్నారు.

క్లుప్తంగా

చోరీ కేసు నిందితుడి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు రాంబాబు

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు దిగువ వీధి రామమందిరం హుండీలో నగదు చోరీకి పాల్పడిన నిందితుడు ద్వారపురెడ్డి రాంబాబును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎం.రాజేష్ శుక్రవారం తెలిపారు. ఇటీవల మందిరంలోకి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి, హుండీని పగలగొట్టి, అందులో ఉన్న నగదు తీసుకుని పరారైనట్లు ఫిర్యాదు అందిందని, దీనిపై దర్యాప్తు చేస్తే అదే గ్రామానికి చెందిన వ్యక్తిని పట్టుకున్నామన్నారు. అనంతరం అతడి వద్ద నుంచి కొంత నగదు, చోరీకి వినియోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిందితుడిని పార్వతీపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామన్నారు.

ముగిసిన సంగాం జాతర

- హుండీల ఆదాయం రూ.5.21 లక్షలు



హుండీల్లోని ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

వంగర: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, మండలంలోని సంగాంలో సంగమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన జాతర శుక్రవారం ముగిసింది. దేవదాయ శాఖ, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు జరిగిన ఈ జాతరలో 80 వేలకు పైగా భక్తులు సంగమేశ్వరుని దర్శించి, పూజలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో భక్తుల కానుకల రూపంలో హుండీలో చేరిన ఆదాయం కూడా ఆలయ అధికారులు లెక్కించారు. శీఘ్ర దర్శనం ద్వారా రూ.2.88 లక్షలు, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.1,42,200, హుండీ ఆదాయం రూ.90,934 రాగా మొత్తం రూ.5,21,214 వచ్చినట్లు ఆలయ ఈఓ పొన్నాడ శ్యామలరావు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: రైలు ఢీకొని, ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం నగరంలోని రైల్వేస్టేషన్ దగ్గర చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ రవివర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భువనేశ్వర్ నుంచి రామేశ్వరం వెళ్తున్న విజయనగరం ఎక్స్‌ప్రెస్ రైలు రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం..కి వస్తుండగా, 30 నుంచి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి రైల్వే ట్రాక్ దాటేందుకు ప్రయత్నించగా, ప్రమాదవశాత్తు ఆ రైలు ఢీకొని, అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్లు 9666555214, 9490617089 సంప్రదించాలని ఆయన కోరారు.

జాతరకు వేళాయె!

- రేపటి నుంచి శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతర
- అట్టహాసంగా మూడు రోజుల పాటు నిర్వహణ
- 3 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం





ముస్తాబైన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం(ఇన్‌సెట్లో) ప్రత్యేకాలంకరణలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి, చల్లని ఆశీస్సులు అందించే శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు సర్వం సిద్ధమైంది. ప్రతిఏటా మాదిరిగానే జాతర నిర్వహణకు ఆలయ ప్రాంగణంతో పాటు చీపురుపల్లి పట్టణమంతా సరికొత్త విద్యుత్‌కాంతులతో మెరిసిపోతోంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశాలోని పలు ప్రాంతాల నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో జాతరకు వచ్చి, అమ్మవారిని దర్శిస్తుంటారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవాలు ఆది, సోమ, మంగళవారాల్లో అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతరకు దాదాపు 3 లక్షల మంది భక్తులు రానున్నారని దేవదాయ శాఖ అధికారులు, అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. ఏడాది పొడవునా పూజలు అందుకుంటూ భక్తులకు ఆశీస్సులు అందించే శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతర జరిగే మూడు రోజులకు ఓ ప్రత్యేకత ఉంటుంది. భక్తులను ప్రసన్నం చేసేందుకు అమ్మవారు సైతం అత్యంత శోభాయమానంగా దర్శనమిస్తుండడం విశేషం.

అక్కాచెల్లెళ్లుగా..

కనకమహాలక్ష్మి అమ్మవారు, కోటదుర్గమ్మ, అసిరితల్లి అక్కచెల్లెళ్లుగా భక్తులను సంరక్షిస్తూ ఇక్కడి ప్రజల ఇష్టదైవంగా కొలువుదీరారు. ఈ నేపథ్యంలో జాతర జరిగే మూడు రోజుల పాటు ఆయా అమ్మవార్లకు భక్తులు పెద్దఎత్తున పూజలు చేస్తారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీపడతారు.

డొనేషన్లు నిలుపుదల..

ఈ ఏడాది కూడా అమ్మవారి జాతర సందర్భంగా డొనేషన్ల స్వీకరణ కార్యక్రమం నిలుపుదల చేశారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచనలతో దేవస్థానం కమిటీ డొనేషన్ల వసూళ్లను నిలిపివేసింది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా డొనేషన్లు వసూలు చేయడం లేదు. గతంలో జాతర పేరిట పట్టణంలోని చిరు వ్యాపారుల దగ్గర నుంచి బడా వ్యాపారస్తుల వరకు డొనేషన్ల సమస్యతో ఇబ్బంది పడేవారు. ఇప్పుడు డొనేషన్ల స్వీకరణకు చెల్లుచీటీ కావడంతో అంతా సంతోషంగా ఉన్నారు.

రూ.100కు వీఐపీ దర్శనం..

జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం దేవదాయ ధర్మాదాయ శాఖ రూ.10 నుంచి రూ.100 వరకు దర్శనం టిక్కెట్లను అందుబాటులో ఉంచుతోంది. అందులో భాగంగానే రూ.10తో మొక్కుబడి దర్శనం, రూ.20తో విశిష్ట, అతిథి దర్శనానికి అవకాశం కల్పించారు. రూ.100 దర్శనం టిక్కెట్లు ద్వారా వీఐపీ దర్శనం అవకాశం కల్పించారు. ప్రశాంత వాతావరణంలో భక్తులు అమ్మవారి దర్శనం చేసుకునేలా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు.



దైవ దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెంట్లు

పూజా కార్యక్రమాలివే..

మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి జాతరలో భాగంగా చేసే కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు ఆరవిల్లి శ్రీనివాసరావు, రవిశర్మ నేతత్వంలో విశేష పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ నెల 26న(ఆదివారం) ఉదయం 5 గంటల నుంచి సంప్రదాయ నేత్రోత్సవం, 7 గంటల నుంచి జంగిళ్లతో పాలధార ఉత్సవం, మధ్యాహ్నం 3 గంటల నుంచి అమ్మవారి ఘటాల ఊరేగింపు, ప్రభ సంబరాలు, శోభాయాత్ర ఘనంగా నిర్వహిస్తారు. అలాగే ఈ నెల 27వ తేదీన(సోమవారం) ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు, 28వ తేదీన(మంగళవారం) ఉదయం నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి అక్కచెల్లెళ్లుగా పిలువబడుతున్న అసిరితల్లి, భాగిరేతమ్మ కోటదుర్గమ్మలకు భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించి, పూజలు చేస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి అమ్మవారి ఘటోత్సవం, శోభాయాత్ర, సత్య ప్రదర్శనలు నిర్వహిస్తారు.

ఎనిమిదేళ్ల బాలికపై లైంగికదాడి

గుర్ల: ఎనిమిదేళ్ల బాలికపై ఓ ఆటోడ్రైవర్ లైంగికదాడికి పాల్పడిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక గ్రామం పక్కనే ఉన్న మరో గ్రామంలోని తన తాతగారి ఇంటి వద్ద ఉండి, అక్కడి ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. ఇటీవల ఆ బాలిక స్వగ్రామంలో పండగ జరగడంతో పండగ జరిగినన్ని రోజులు పాఠశాల ఉన్న గ్రామానికి, బాలిక స్వగ్రామానికి ఆటోలో వచ్చిపోతుండేది. ఇదే సమయంలో బాలికను ఆటోలో డ్రాప్ చేసేందుకు వెళ్లిన ఆటోడ్రైవర్ ఆటోలో బాలికను తరలించినా ప్రతీసారి బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు సమాచారం. కొన్నిరోజుల క్రితం ఉన్నట్టుండి బాలిక అనారోగ్యానికి గురికావడంతో అసలు విషయం బయటపడింది. బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.శిరీష తెలిపారు.

టీటీడీ ఆర్థికసాయంతో శివాలయ నిర్మాణం



బొడారపువలస కొండపై బయటపడిన శ్రీరాముని పాదముద్ర

రామభద్రపురం: మండలంలోని జన్నివలస పంచాయతీ, బొడారపువలస గిరిజన గ్రామ పొలిమేరల్లో టీటీడీ ఆర్థికసాయంతో శివాలయం నిర్మిస్తున్నట్లు హిందూ పరిషత్ సమరత సేవా సంఘం కన్వీనర్ పతివాడ సత్యానారాయణ శుక్రవారం తెలిపారు. ఓ చిన్న కొండపై ఆలయ నిర్మాణం చేస్తూ పరిసరాలు శుభ్రం చేస్తుండగా శ్రీరాముని పాదముద్ర బయటపడింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో దాదాపు రూ.18 లక్షల వ్యయంతో ఆలయం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

ఎప్పటిలాగే బైక్‌పై వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి తిరిగివస్తారనుకున్నారు.. కానీ రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో వారిని కబలించింది. వారి కన్నతల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. భామిని మండలంలోని అత్తికొత్తూరు దగ్గరలో బైక్ బోల్తా పడిన దుర్ఘటనలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. గ్రామస్తులను విషాదంలోకి నెట్టింది.

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- అత్తికొత్తూరు సమీపంలో విషాదం



తీవ్రగాయాలతో జీవన్



కొడుకు మృతదేహం పట్టుకుని విలపిస్తున్న తల్లి సుజాత

భామిని: మండలంలోని అత్తికొత్తూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి ఆరిక రాకేష్(13), జీవన్(20) దుర్మరణం చెందారు. బిడ్డిక జీవన్, ఆరిక రోహిత్ అనే మరో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహం తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. తాటిమానుగూడకు చెందిన రాకేష్, జీవన్, రోహిత్‌తో కలిసి ఘనసర గ్రామం నుంచి తాటిమానుగూడ వైపు బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి వారి బైక్ బోల్తాపడింది. దీంతో బైక్ నడుపుతున్న రాకేష్ రోడ్డును బలంగా తాకడంతో తీవ్రగాయాలపాలై, సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మిగతా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వైద్యసేవల కోసం క్షతగాత్రులను దగ్గరలోని కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జీవన్‌ను శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించగా, రోహిత్‌ను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ జీవన్ చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుల్లో రాకేష్ శ్రీకాకుళం టీడబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కొడుకు మరణ వార్త విని, ఘటన స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. చేతికి అందివచ్చిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లిపోయాడని విలపించారు. ఇదే ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు బత్తిలి ఎస్ఐ వై.అమ్మాన్‌రావు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టుదలతోనే విజయం సొంతం



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న ఫ్రెంచ్ గ్రూపు ఏడీపీ చైర్మన్, ఆగస్టిన్ డి.రోమానెట్

- జీఎంఆర్ ఐటీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఫ్రెంచ్ గ్రూపు ఏడీపీ చైర్మన్, సీఈఓ ఆగస్టిన్ డి.రోమానెట్

రాజాం సిటీ: పట్టుదలతోనే విజయాలు సాధ్యమవుతాయని, అందుకు నిదర్శనం గ్రంధి మల్లికార్జునరావేనని పారిస్‌కు చెందిన గ్రూపు ఏడీపీ చైర్మన్, సీఈఓ ఆగస్టిన్ డి.రోమానెట్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన జీఎంఆర్ ఐటీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వృత్తిపరమైన, వ్యక్తిగత విజయాలను నిర్మించడంలో జీఎంఆర్ ఐటీ ఓ గొప్ప సంస్థ అని పేర్కొన్నారు. ప్రజల కలలను నెరవేర్చడానికి జీఎంఆర్‌వీఎఫ్ కృషి ప్రశంసనీయమన్నారు. జీఎంఆర్ గ్రూపుతో వ్యాపార ఒప్పందంలో భాగంగా ఫ్రెంచ్ కంపెనీ గ్రూపు ఏడీపీ పెట్టుబడులు పెట్టిందని, జీఎంఆర్ సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యం కోసం చూస్తున్నామన్నారు. పని, దృష్టి, పుస్తకాలు, జ్ఞానం కోసం ఇంటర్నెట్, సమాజానికి సహకారం-ఆశయం, కలలతో పాటు మంచి వ్యక్తులతో చెలిమి వంటి విషయాలను అలవర్చుకుంటే సంతోషంతో పాటు భావోద్వేగాల నియంత్రణకు ఉపయోగపడుతుందన్నారు. ఆగస్టిన్ డి.రొమానెట్ పేరిట స్కాలర్‌షిప్‌లు, అవార్డులు ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పారిస్‌లో జీఎంఆర్ ఐటీ విద్యార్థులకు ఉచితంగా ఇంటర్న్‌షిప్‌లు ప్రకటించారు. అనంతరం పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ జీఎంఆర్ వీఎఫ్ ఏర్పాటు, ముఖ్య ఉద్దేశ్యాలను వివరించారు. సమాజానికి సేవ చేయడంతోపాటు మంచి విద్య, వైద్యం అందించడమే జీఎంఆర్ వీఎఫ్ లక్ష్యమని, దీనిలో భాగంగా 'గిఫ్టెడ్ చిల్డ్రన్' కార్యక్రమం ఒకటని, ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు చెందిన చిన్నారులను దత్తత తీసుకుని, జీఎంఆర్‌వీఎఫ్ ద్వారా చదివిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 2500 మందిని దత్తత తీసుకుని వారికి ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు వచ్చే వరకు సహకారం అందించడం సంతృప్తినిచ్చిందన్నారు. శుక్రవారం మరో పది మంది పిల్లలను దత్తత తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ సీఎల్‌వీ ఆర్‌ఎస్‌వీ ప్రసాద్, బిజినెస్ చైర్మన్ జీబీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
Union Bank of India
రీజనల్ ఆఫీస్, హెచ్.నెం.8, సింహ ద్వారం ఆర్చ్ దగ్గర, వెంకటాపురం, శ్రీకాకుళం జిల్లా. ఫోన్: 08942-270919, 270944

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1) ప్రకారం నోటీసు (స్థిరాస్తి కొరకు)

క్రింది సంతకందారుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు అధీకృత అధికారి. సదరు అధికారివారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 2002 యొక్క 54) మరియు 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల 2002 లోని నిబంధన 3తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని దిగువ పేర్కొన్న ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలకు నోటీసులో తెలిపిన బకాయి నోటీసు అందిన 60రోజుల లోగా చెల్లించమని కోరుతూ ఈ దిగువ తెలిపిన తేదీన డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది.

సదరు బకాయి మొత్తాన్ని ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలు చెల్లించనందు వలన క్రింద వివరించిన ఆస్తిని సదరు నిబంధనలులోని నిబంధన 8 తో చదువుకొనే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని ఈ దిగువ తెలిపిన తేదీన క్రింది సంతకందారుడు లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

సదరు ఆస్తితో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం చేయరాదని మరియు ఒక వేళ ఎవ్వరైనా సదరు ఆస్తితో వ్యవహారం చేసినచో ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలు చెల్లించాల్సిన బకాయి మొత్తం మరియు దానిపై గల వడ్డీ మొత్తాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఛార్జికి లోబడి ఉండునని ముఖ్యంగా ఋణగ్రహీత / సహ-ఋణగ్రహీతలకు మరియు ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

నోటీసు, ఋణగ్రహీతల వివరములు

1) పార్వతీపురం బ్రాంచి (04231), పార్వతీపురం మన్యం జిల్లా — ఫోన్

ఋణగ్రహీతల యొక్క పేర్లు : 1) మెస్సర్స్ ఎం.జి.ఆర్ మోడర్న్ రైస్ మిల్స్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీమతి మచ్చ త్రివేణి, భర్త. సత్యనారాయణ, నివాసం డోర్ నెం.15-3-61/1, ఫ్లాట్ నెం.102, "ఎల్ బి టవర్స్" బ్లాక్ నెం.4, టి.ఎస్.నెం.126-122, సెంచురీ క్లబ్ ఎదురుగా, మహారాణిపేట, విశాఖపట్నం సిటీ, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, విశాఖపట్నం జిల్లా-530002. 2) శ్రీమతి మచ్చ త్రివేణి, భర్త. సత్యనారాయణ, నివాసం డోర్ నెం.15-3-61/1, ఫ్లాట్ నెం.102, "ఎల్ బి టవర్స్" బ్లాక్ నెం.4, టి.ఎస్.నెం.126-122, సెంచురీ క్లబ్ ఎదురుగా, మహారాణిపేట, విశాఖపట్నం సిటీ, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, విశాఖపట్నం జిల్లా-530002. 3) శ్రీ కోరాడ మధుసూదన రావు, తండ్రి. లేటు సుబ్బారావు, నివాసం నెయ్యిల వీధి, పార్వతీపురం గ్రామం, పార్వతీపురం మున్సిపాలిటీ, విజయనగరం జిల్లా-535501, ఆం.ప్ర. 4) శ్రీ మచ్చ సత్యనారాయణ, తండ్రి. లేటు మచ్చ వెంకట నాయుడు, నివాసం డోర్ నెం.15-3-61/1, ఫ్లాట్ నెం.102, "ఎల్ బి టవర్స్" బ్లాక్ నెం.4, టి.ఎస్.నెం.126-122, సెంచురీ క్లబ్ ఎదురుగా, మహారాణిపేట, విశాఖపట్నం సిటీ, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, విశాఖపట్నం జిల్లా-530002.

బకాయి సొమ్ము : రూ.51,23,474.81 పై (అక్షరాల యాభై ఒక్క లక్షల ఇరవై మూడు వేల నాలుగు వందల డెబ్బై నాలుగు రూపాయల ఎనభై నాలుగు పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ.

డిమాండ్ నోటీసు తేది : 19.09.2022 — స్వాధీనం తీసుకున్న తేది : 20.02.2023

స్థిరాస్తి వివరములు : ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం, కొత్తవలస పంచాయితీ, చిత్రకోట, నిమ్మలపాడు రెవెన్యూ గ్రామం, మక్కువ నుండి సాలూరు రోడ్డు ప్రక్కన, ఖాతా నెం.3, సర్వే నెం.59-3బి వద్ద గల 4622.22 చ॥గ॥లు విస్తీర్ణంలోని భూమి మరియు ఫ్యాక్టరీ భవనం సమాన నిష్పత్తిలో తనఖా ఉంచబడిన మెస్సర్స్ ఎమ్.జి.ఆర్ మోడర్న్ రైస్ మిల్ ప్రాతినిధ్యం వహిస్తున్నవారు పార్టనర్స్. హద్దులు : తూర్పు : హక్కుదారుని యొక్క భూమి (ప్రస్తుతం మామిడి తోట), దక్షిణం : రోడ్డు, పడమర : హక్కుదారుని యొక్క భూమి (ప్రస్తుతం ఖాళీ స్థలం ప్రక్కనే ఉన్న ప్రహరీ గోడ), ఉత్తరం : హక్కుదారుని యొక్క భూమి (ప్రస్తుతం మామిడి తోట).

2) ఋణగ్రహీతల యొక్క పేర్లు : 1) శ్రీమతి చంద్రపూడి చిన్నమ్మలు, భర్త. పైడిరాజు, గుల్లిపల్లి వీధి, జగన్నాధపురం గ్రామం, డోర్ నెం.4-47, గుల్లిపల్లి వీధి, పార్వతీపురం, విజయనగరం-535501, ఆంధ్రప్రదేశ్. 2) శ్రీ పిల్లా శ్రీనివాసరావు, 4-84, గోపాలదాసుపేట, పార్వతీపురం, విజయనగరం, ఆంధ్రప్రదేశ్-535501.

బకాయి సొమ్ము : రూ.16,40,737.84 పై (అక్షరాల పదహారు లక్షల నలభై వేల ఏడు వందల ముప్పై ఏడు రూపాయల ఎనభై నాలుగు పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ.

డిమాండ్ నోటీసు తేది : 02.09.2022 — స్వాధీనం తీసుకున్న తేది : 20.02.2023

స్థిరాస్తి వివరములు : ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లా, పార్వతీపురం మున్సిపాలిటీ, పార్వతీపురం గ్రామం యొక్క బ్లాక్ నెం.5, వార్డు నెం.24 లోని గుల్లిపల్లి వీధి యొక్క దక్షిణం వరుస, సర్వే నెం.348/9బి భాగం, గ్రామకంఠం, డోర్ నెం.4-47, అసెస్‌మెంట్ నెం.1019100829 వద్ద గల 146.04 చ॥గ॥లు మరియు 575 చ॥అ॥లు విస్తీర్ణంలోని నివాసయోగ్యమైన స్థలం. హద్దులు : తూర్పు : వసంతాల ప్రసాద్ ఇంటికి దీనికి మధ్యన ఉన్న ఉమ్మడి గోడ, దక్షిణం : మున్సిపల్ సి.సి.రోడ్డు, పడమర : శెట్టి పార్వతి ఇంటికి దీనికి మధ్యన ఉన్న ఉమ్మడి గోడ, ఉత్తరం : గుల్లిపల్లి వీధి మున్సిపాలిటీ సి.సి.రోడ్డు వైపు కాలు.

3) బెలగాం బ్రాంచి, పార్వతీపురం మన్యం జిల్లా — ఫోన్ నెం.08963-221067

సహ-పూచీదారులు మరియు ఋణగ్రహీత యొక్క చట్టరీత్యా వారసులు : 1) శ్రీ తిరుమల రాజు శివ వర్మ, తండ్రి. లేటు టిఎవిఎస్ఎస్ రామ భద్ర వర్మ, ఎఫ్‌సిఐ గోడౌన్ దగ్గర, సాయి నగర్ కాలనీ, పార్వతీపురం-535501. 2) శ్రీమతి టి. స్వాతి, తండ్రి. లేటు టిఎవిఎస్ఎస్ రామ భద్ర వర్మ, ఎఫ్‌సిఐ గోడౌన్ దగ్గర, సాయి నగర్ కాలనీ, పార్వతీపురం-535501. 3) శ్రీ తిరుమల నరసింహ మూర్తి, తండ్రి. లేటు టిఎవిఎస్ఎస్ రామ భద్ర వర్మ, ఎఫ్‌సిఐ గోడౌన్ దగ్గర, సాయి నగర్ కాలనీ, పార్వతీపురం-535501. 4) శ్రీ తిరుమల రాజు గోపి, తండ్రి. లేటు టిఎవిఎస్ఎస్ రామ భద్ర వర్మ, ఎఫ్‌సిఐ గోడౌన్ దగ్గర, సాయి నగర్ కాలనీ, పార్వతీపురం-535501. 5) శ్రీమతి తిరుమల రాజు లక్ష్మి, లేటు టిఎవిఎస్ఎస్ రామ భద్ర వర్మ, ఎఫ్‌సిఐ గోడౌన్ దగ్గర, సాయి నగర్ కాలనీ, పార్వతీపురం-535501. (ఋణగ్రహీత యొక్క చట్టరీత్యా వారసులు)

బకాయి సొమ్ము : రూ.23,86,470.06 పై (అక్షరాల ఇరవై మూడు లక్షల ఎనభై ఆరు వేల నాలుగు వందల డెబ్బై రూపాయల ఆరు పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ.

డిమాండ్ నోటీసు తేది : 19.04.2022 — స్వాధీనం తీసుకున్న తేది : 20.02.2023

స్థిరాస్తి వివరములు : విజయనగరం జిల్లా, పార్వతీపురం మండలం, అడ్డపుసీల గ్రామం యొక్క సర్వే నెం.41/1 భాగం, 41/2 భాగం వద్ద ప్లాట్ నెం.115, 116, 117 లోని 544.44 చ॥గ॥లు విస్తీర్ణంలోని నివాసయోగ్యమైన భూమి మరియు భవనం. హద్దులు : తూర్పు : శరి రాణియమ్మ యొక్క ఖాళీ స్థలం, దక్షిణం : 25 అ॥ల లే-అవుట్ రోడ్డు, పడమర : ప్లాట్ నెం.114 కు చెందిన ఖాళీ స్థలం, ఉత్తరం : 25 అ॥ల లే-అవుట్ రోడ్డు.

తేది : 20.02.2023
స్థలం : పార్వతీపురం
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీకాకుళం రీజియన్

ముందస్తు చర్యలతో రోడ్డు ప్రమాదాల నివారణ

- రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ముందస్తు చర్యల ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించగలమని ఆ దిశగా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని జేసీ కె.మయూర్ అశోక్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన రహదారి భద్రతా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు.. మలుపులు, కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలకు సంబంధించిన వివరాలను ఐరాడ్ సైట్‌లో నమోదు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది స్పందించి, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో కొన్నిచోట్ల విధుల్లో అలసత్వం వహిస్తున్న అధికారుల తీరుపై జేసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను జేసీ దృష్టికి అధికారులు తీసుకురాగా, స్పందించిన ఆయన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుంకలాం పరిధిలో శాటిలైట్ బస్టాండ్ కోసం స్థలం కేటాయించాలని ప్రజా రవాణా అధికారి కోరగా ఆర్టీఓకు లేఖ రాయాలని జేసీ తెలిపారు. ఐనాడ జంక్షన్ వద్ద ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్టాప్ రోడ్డుకు దగ్గరగా ఉందని, ఈ క్రమంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అధికారులు తెలపగా, దాన్ని తొలగించి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను జేసీ కోరారు. అలాగే కలెక్టరేట్ పరిసరాల్లోని దుకాణాలను తొలగించి, వారికి ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలం కేటాయించాలని తద్వారా ట్రాఫిక్ సమస్యలు తలెత్తవని జేసీ మున్సిపాలిటీ అధికారులకు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వి.సుందర్, ట్రాఫిక్ డీఎస్పీ మోహన్‌రావు, డీఎంఅండ్‌హెచ్ఓ రమ ణకుమారి, పంచాయతీరాజ్ ఎస్ఈ, ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఈఈ, మున్సిపల్ శాఖ, వైద్యా రోగ్య శాఖ, పోలీస్ శాఖ అధికారులు, ఐరాడ్ విభాగం జిల్లా మేనేజర్ శ్రీధర్, ఎంవీఐ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు



ఘటన స్థలంలో క్షతగాత్రుడికి సపర్యలు చేస్తున్న స్థానికులు

దత్తిరాజేరు: బస్సు ఢీకొని, ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని ఇంగిలాపల్లి సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మెంటాడ మండలంలోని జయతి గ్రామం నుంచి పల్ల రాము, టి.సత్యం బైక్‌పై వెళ్తుండగా, గజపతినగరం నుంచి జక్కువ వెళ్తున్న ఓ పల్లె వెలుగు బస్సు వీరిని బలంగా ఢీకొట్టింది. దీంతో కిందపడిన వారు గాయాలపాలయ్యారు. అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి, వైద్యసేవల నిమిత్తం గజపతినగరం సామాజిక ఆస్పత్రికి వారిని తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రికి వారిని తరలించారు. ఈ ఘటనపై పెదమానాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కేసుల నమోదు

విజయనగరం క్రైమ్: ఐటీ యాక్ట్ కింద రెండు కేసులు నమోదైనట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శుక్రవారం తెలిపారు. పద్మావతినగర్‌కు చెందిన ఎస్.సాయిగౌతమ్ ఆన్‌లైన్ యాప్‌లో ఓ టాయ్ కొనుగోలు చేశాడు. ఇంటికి చేరిన ఆర్డరు(కొనుగోలు చేసిన టాయ్)వేరేది రావడంతో గూగుల్ ద్వారా సంబంధిత యాజమాన్యానికి ఫిర్యాదు చేసేందుకు వేరే యాప్‌తో ప్రయత్నించాడు. వారు ఇచ్చిన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ప్రాసెస్ చేయడంతో అతడి అకౌంట్ నుంచి రూ.55,900 నగదు విత్‌డ్రా అయింది. అలాగే తోటపాలెం బాలాజీనగర్‌లో నివాసముంటున్న సూర్యనారాయణ అనే వ్యక్తి కూడా మోజో యాప్‌లో వచ్చిన వీడియోలకు లైక్‌లు కొట్టడం ద్వారా రూ.100, రూ.200 సంపాదించాడు. ప్రీ-పెయిడ్ ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని వచ్చిన మెసెజ్‌కి స్పందించి, చాటింగ్ చేశాడు. లింక్ ఓపెన్ చేసి, క్యాన్సిల్ ప్రెస్ చేయమని వచ్చిన ఆదేశాల మేరకు క్యాన్సిల్ బటన్ ప్రెస్ చేయగానే అతడి అకౌంట్ నుంచి రూ.35 వేలు విత్‌డ్రా అయిపోయాయి. దీంతో అతడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹107	₹184	₹ 194

చికిత్స పొందుతూ బాలుడి మృతి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): విద్యుత్‌షాక్‌కు గురై, విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గురాన పురుషోత్తం(12) అనే బాలుడు శుక్రవారం ఉదయం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. గుర్ల మండలంలోని చింతపల్లిపేటకు చెందిన గురాన పైడిరాజు తన భార్యాపిల్లలతో కలిసి గరివిడి వినాయక కాలనీలో నివాసముంటున్నాడు. పైడిరాజు కొడుకు పురుషోత్తం గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం వారు నివాసం ఉంటున్న కాలనీ సమీపంలోని డాబా ఇంటిపైకి మిత్రులతో కలిసి చదువుకోవడానికి పురుషోత్తం వెళ్లి, విద్యుత్‌షాక్‌కు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గాయాలపాలైన బాలుడిని వైద్యసేవల నిమిత్తం తొలుత చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఉదయం చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE
■ Deluxe 2 BR Flat poly ceiling & Car Park, loan can be arranged, 100% Vasthu @ R&B Guest house Road, Alakananda Colony, VZM. Ph : 92466 24248, 63035 11633 [V-775049]

PLOT FOR SALE
■ విజయనగరం జొన్నాడ విలేజ్‌లో VUDA ప్లాటు 400 Sq.yds, West Facing హైవేకి 1/2 కి.మీ దూరంలో అమ్మకంనకు కలదు. ఫోన్ : 89786 05566 [V-775047]

WANTED
■ నిరుద్యోగులకు సువర్ణ అవకాశం: ప్రముఖ IRPM కంపెనీ 26 సం॥ పూర్తి చేసుకొన్న సందర్భంగా SKLM, VZM లో Q: 10th, Inter చదివిన 28 సం॥లోపు 50 మంది స్త్రీ/పు॥లకు ధరఖాస్తు. సెల్: 9849553548. [WA-6498]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781902]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోదానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్ నర్సులు, వంటవారు, Rmp Dr. Q-5th-డిగ్రీ, 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. ఫోన్ : 7995365999 [HA-1030]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-9790]

■ అగ్రికల్చర్ ఫీల్డ్ వర్క్ చేయుటకు 10th to డిగ్రీ గల స్టాఫ్ కావలెను. జాబ్స్ (1) D.C.O – జీతం : 22 వేలు + 3 వేలు. & ఫీల్డ్ ఆఫీసర్ : జీతం : 14 వేలు + 2,500. 7680002670, 8885863691. [A-734033]

■ E.G.P. స్కూల్ నందు పనిచేయుటకు టీచర్స్ (ఫ్యామిలీ) మరియు వంట చేయుటకు (ఫ్యామిలీ), వంటవాళ్ళు (Christians) కావలెను. కుంటినవలస, మెంటాడ (మం), VZM. Ph: 8555024880, 9985693480. [C-789377]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.